## పాఠము - 42

# (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే కొన్ని గుప్తరూపములు)

అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఈ విధముగా ఉపదేశించెను:

فَلَا تَجْعَلُوا لِلّٰهِ اَنْدَادًا وَّ اَنْتُمْ تَعْلَمُوْنَ

**"ఇక మీకు తెలిసినప్పుడు అల్లాహ్‌కు సాటి కల్పించకండి." (2:22)**

హజరత్ ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఈ వాక్యం తఫ్సీర్‌లో ఈ విధముగా తెలిపెను: "అన్‌దాద్ అంటే భాగస్వాములను కల్పించుట" అని అర్థము. ఏదైతే చీకటి రాత్రిలో నల్లటి రాయిపై చీమ నడకకంటే గుప్తమైనది. భాగస్వాములను కల్పించుట అనేది ఈ విధముగా పలుకుట. "అల్లాహ్ యొక్క ప్రమాణము మరియు నీ జీవితముపై ప్రమాణము" లేదా ఇలా పలుకుట, "ఓ వ్యక్తి నా ప్రాణము యొక్క ప్రమాణము" లేదా ఇలా పలుకుట, "ఈ కుక్క లేనిచో మా ఇంటిలో దొంగలు పడేవారు" లేదా ఇలా పలుకుట, "అల్లాహ్ కోరుకున్నది, మీరు కోరుకున్నది" లేదా ఇలా పలుకుట "ఒకవేళ అల్లాహ్ లేకపోతే నీవులేవు" ఇటువంటి పలుకులలో అల్లాహ్‌తోపాటు ఇతరులని చేర్చవద్దు. ఇవన్నీ అల్లాహ్‌కు షిర్క్ వంటి మాటలు. (దీనిని ఇబ్నె అబీ హాతిం పొందుపరచెను)

హజరత్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) ప్రవక్త బోధనను ఈ విధముగా ఉల్లేఖించారు:

"ఎవరైతే అల్లాహ్ పేరును తప్ప ఇతరుల ప్రమాణము చేయునో వాడు తిరస్కరించినవాడయ్యెను. లేదా షిర్క్‌కు పాల్పడినట్లు చేసెను. (దీనిని తిర్మిజీ పొందుపరచి హసన్ అని తెలిపెను. హాకిం సహీ అని తెలిపెను) హజరత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) ఈ విధముగా ఉద్బోధించారు: "నా వద్ద అల్లాహ్‌కాక ఇతరులపై స్వచ్ఛమైన ప్రమాణము చేయుటకంటే అల్లాహ్‌పై అసత్య ప్రమాణము చేయుట మేలు."

హజరత్ హుజైఫా (రజి అల్లాహు అన్హు) ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) బోధనను ఇలా తెలిపారు:

"అల్లాహ్ కోరునది మరియు మీరు కోరునది" అని పలకవద్దు. కాని ఈ విధముగా పలకండి, "ముందు అల్లాహ్ కోరుకున్నది ఆ తరువాత మీరు కోరుకున్నది." (అబూ దావూద్, సనద్ సహీ)

ఇబ్రాహీం నఖయి ఈవిధముగా విశదీకరించారు: "అవూజు బిల్లాహి వబిక" అని పలకరాదు.

"అవూజు బిల్లాహి సుమ్మబిక" అని పలకవచ్చును. అదే విధముగా "లవ్‌లా అల్లాహు సుమ్మ ఫలానున్" అని పలకవచ్చును. "లవ్‌లా అల్లాహు వఫులానున్" అని పలకరాదు.

1. అన్‌దాద్ గురించి (2:22) వాక్యము భావము విశదీకరించబడెను.
2. 'షిర్కె అక్బర్' గురించి అవతరించబడిన వాక్యములను అనుచరులు 'షిర్కె అస్గర్'కి కూడా వివరిస్తూ విశదీకరించేవారని స్పష్టమగుచున్నది.
3. అల్లాహ్ పేరుపై తప్ప ఇతరులపై ప్రమాణము చేయుట షిర్క్.
4. అల్లాహ్ పేరున కాకుండా ఇతరుల పేరున చేయు సత్యమైన ప్రమాణము, అల్లాహ్ పేరున చేయు అసత్య ప్రమాణము కంటే పెద్ద పాపము.
5. వావ్, సుమ్మ పదముల అర్థములో చాలా వ్యత్యాసము కలదు.